ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
7 జిల్లా వార్తలు
ఆదివారం 25 మే 2025

ఉష్ణోగ్రత
గరిష్ఠం 35.5
కనిష్ఠం 22.2

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

- కలెక్టర్ నారాయణరెడ్డి
- నేడు గ్రామ పాలన అధికారి ఉద్యోగానికి పరీక్ష
- ఒకే సెంటర్.. హాజరు కానున్న 300మంది అభ్యర్థులు

రంగారెడ్డి అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం నిర్వహించే గ్రామ పాలన అధికారి పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్ష కోసం ఒక్క సెంటర్‌ను మ్రామే ఏర్పాటు చేశారు. జిల్లెలగూడ జెడ్పీహెచ్ఎస్‌లో కేంద్రంలో 300 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగనుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కలెక్టర్ సి. నారాయణరెడ్డి కొన్ని సూచనలు చేశారు. ప్రతీ అభ్యర్థి తన హాల్ టికెట్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకొని, అందులో ఉన్న వ్యక్తిగత వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా చూసుకోవాలని తెలిపారు. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని, వాటిలో ఒకదాన్ని కంట్రోలింగ్ అధికారి సంతకం చేయించి హాల్ టికెట్‌పై అంటించాలన్నారు. మరో ఫొటోను పరీక్ష గదిలో ఇన్విజిలేటర్‌కు ఇవ్వాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాలులోకి అనుమతించరని తెలిపారు. బ్లూ, బ్లాక్ కలర్ బాల్‌పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించేది లేదన్నారు. గుర్తింపు కార్డు, ఆధార కార్డు తప్పనిసరిగా తీసుకురాలని కలెక్టర్ తెలిపారు.



ఆడిట్‌లో పాల్గొన్న అదనపు డీఆర్‌డీవో సూర్యారావు తదితరులు

మహిళా సమాఖ్య రికార్డుల ఆడిట్

ఇబ్రహీంపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల మహిళా సమాఖ్యలో 2024-25 సంవత్సర ఆర్థిక లావాదేవీలకు సంబంధించి శనివారం ఆడిట్ నిర్వహించారు. అదనపు డీఆర్‌డీవో సూర్యారావు, సెర్ప్ కార్యాలయ సీబీవో ఆడిటర్ మధు రికార్డులను పరిశీలించారు. వీవోఏల నెలవారీ పొదుపు, ఇచ్చిన అప్పు, వసూళ్లు, శ్రీనిధి, సమావేశాల నిర్వహణకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. అంతేగాక 2025-26 సంవత్సరానికి సంబంధించి బ్యాంకు లింకేజీ టార్గెట్లు ఏ మేరకు చేశారనే దానిపై ఆరా తీశారు. అలాగే విద్యార్థుల యూనిఫాం, లోకోస్ యాప్ డాటా ఎంట్రీ తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపు కోసం ప్రభుత్వాలు విశేషంగా కృషి చేస్తున్నాయి. ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టాలని ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. తాగు, సాగు నీటి సమస్య రాకూడదనే ఉద్దేశంతో ఫామ్ పాండ్స్ తవ్వకాలను అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ పొలాలు, అటవీ ప్రాంతాలు, ప్రభుత్వ స్థలాల్లో నీటి గుంతల తవ్వకాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 14 మండలాల్లో వీటి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వచ్చే నాలుగేళ్లలో 293 ఫామ్ పాండ్స్ తవ్వకాలు జరపాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



నానక్‌నగర్‌లో ఫామ్ పాండ్స్ తవ్వుతున్న ఉపాధి కూలీలు

నీటి గుంత.. తీరును చింత!

- ఉపాధి హామీ పథకం కింద పనులు
- నాలుగేళ్లలో 293 నీటి కుంటల లక్ష్యం
- జిల్లాలో యాచారం మండలం టాప్

ఫామ్ పాండ్స్ తవ్వకాలకు ప్రోత్సాహం

ఫామ్ పాండ్స్ వివరాలు	2022-23	2023-24	2024-25	2025-26	మొత్తం	విలువ
	25	70	83	115	293	రూ.4,48,75,095



మంతన్‌గౌరెల్లిలో ఫామ్ పాండ్స్

రంగారెడ్డి అర్బన్/యాచారం, మే 24 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాల పెంపునకు ఉపాధి హామీ పథకం కింద ఫారం పాండ్స్ (నీటి కుంటల) తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటి ద్వారా నీటి మట్టాలు పెరగడంతో పాటు భూమిలో తేమ శాతం తగ్గకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రతీ పంచాయతీలో నీటి కుంటల తవ్వకాలు జరిపించాలని నిర్ణయించింది. ఎక్కువగా వ్యవసాయ భూముల వద్ద ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకునేలా ఉపాధి హామీ అధికారులు రైతుల్లో చైతన్యం కలిగిస్తున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఫామ్ పాండ్స్ తవ్వకాల కోసం

మిగతా 10వ పేజీలో...

జిల్లాలో యాచారం టాప్

నీటి కుంటల తవ్వకాల్లో జిల్లాలోని యాచారం మండలం టాప్‌లో ఉంది. 2023-24 నుంచి 2025-26 వరకు మొత్తం 97 నీటి కుంటలను తవ్వించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు వంద శాతం పూర్తి చేశారు. 2022-23 నుంచి ఇప్పటి వరకు చేవెళ్ల, కొత్తూరు, మహేశ్వరం, మొయినాబాద్, నందిగామ, శంషాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో ఈ ఏడాది ఇంత వరకు ఒక్క ఫారం పాండ్స్ ఏర్పాటు చేయక పోవడం గమనార్హం. ఆమనగల్లు, కేశంపేట మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున నీటి గుంతలు తవ్వించారు.

అవగాహన కల్పిస్తున్నాం



నీటి కుంటల తవ్వకాల వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. పంట పొలాల్లో నీటి కుంటలను నిర్మిస్తూ భూగర్భ జలాలు పెంపుదలకు కృషి చేస్తున్నాం. ఫారంపాండ్స్ తవ్వకం నాలుగేళ్ల క్రితం చేపట్టి ఉంటే జిల్లాలో భూగర్భజలం గణనీయంగా పెరిగేది. బుష్ క్లియరెన్స్ నేల చదును తదితర పనులకు ప్రాధాన్యమివ్వకుండా ఫారంపండ్స్ తవ్వకాలపై అధిక శ్రద్ధ చూపుతాం. వీటిలో వర్షాకాలంలో చేపలు పెంచి ఆదాయం పొందవచ్చు. వృథా భూములు, గుట్టల ప్రాంతాల్లో ఫారం పాండ్స్ తవ్వకానికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. దీనివల్ల కూలీలకు కూడా చేతి నిండా పనిదొరుకుతుంది.

- శ్రీలత, డీఆర్డీవో పీడీ

విమానంలో యువకుడికి గుండెపోటు

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఫ్లైట్ అత్యవసర ల్యాండింగ్
- ఆస్పత్రిలో చికిత్స

శంషాబాద్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : జైపూర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఐఎక్స్2729 ఎయిరిండియా విమానంలో బుధవారం ఓ యువకుడికి గుండెపోటు వచ్చింది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది వెంటనే పైలెట్లకు సమాచారం అందించారు. వారు దగ్గరిలో ఉన్న శంషాబాద్ ఏటీసీ అధికారులకు సంప్రదించి విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. యువకుడిని ఎయిర్‌పోర్టు అపోలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు చెప్పినట్లు తెలుస్తోంది.

నర్సరీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం

చన్వెల్లి మిర్చి రైతులకు కలెక్టర్ హామీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేవెళ్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన 'పూత లేదు.. కాత లేదు' అనే కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. చేవెళ్ల మండలం చన్వెల్లి గ్రామానికి చెందిన 40 మంది బాధిత రైతులు కలెక్టరేట్‌కు తరలివెళ్లి కలెక్టర్ నారాయణరెడ్డితో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావులను కలిశారు. వారికి జరిగిన అన్యాయాన్ని వివరించడంతోపాటు వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలోని ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన నర్సరీలో మిర్చి నారును కొనుగోలు చేసిన 40 మంది రైతులు 70 ఎకరాల్లో పంటలను సాగు చేశారు. రెండు నెలలు దాటినా పూత రాలేదు, కాత కాయలేదని వాపోయారు. నాణ్యత లేని మిర్చి నారు సరఫరా చేసి మోసం చేసిన నర్సరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. రైతులకు మొక్కలను సరఫరా చేసిన నర్సరీపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడం వల్లనే జిల్లా అధికారులు తక్షణమే స్పందించారని చన్వెల్లి గ్రామం రైతులు హర్షం వ్యక్తం చేశారు.



జాపాలలో శ్రీనివాస్‌రెడ్డి సాగుచేస్తున్న పందిరి కూరగాయలు

వ్యవసాయమే జీవనం అందరికీ ఆదర్శం

ఆధునిక సాగులో రాణిస్తున్న కంది సోదరులు

- ఉద్యోగాల కంటే వ్యవసాయమే మిన్న అనుకున్నారు
- అందుబాటులో ఉన్న వనరులతో పంటల సాగు
- ఉత్పత్తులను మార్కెట్ తరలించి విక్రయాలు
- హోల్‌సేల్‌గా అమ్ముతూ లాభాల ఆర్జన

8

Sunday Special

వ్యవసాయమంటే అందరికీ ఆసక్తి ఉండదు. కొందరు మాత్రమే ఇష్టంతో ఈ రంగంలో రాణిస్తుంటారు. ముఖ్యంగా యువకులు ఎవరైనా వ్యవసాయం చేస్తున్నామంటే చిన్నచూపు చూస్తారు. వ్యవసాయమంటే దండగ అనే ఈ రోజుల్లో ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ పంటలు పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు కంది బ్రదర్స్. తమకున్న పరిజ్ఞానంతో కూరగాయల సాగు ద్వారా మంచి లాభాలను పొందుతున్నారు ఈ సోదరులు. మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిల సక్సెస్‌పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- మంచాల, మే 24(ఆంధ్రజ్యోతి)

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల మృతి

యాచారం, మే 24(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన యాచారంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడ్తాల మండలంలోని పల్లెచెల్కతండాకు చెందిన వి.అశోక్(22), అతని బావమరిది నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం దంజాలాల్ తండాకు చెందిన అరుణ్(24)లు హైదరాబాద్ నుంచి పల్లెచెల్కతండాలో జరిగే విందులో పాల్గొనేందుకు బుల్లెట్‌పై వస్తున్నారు. కాగా, యాచారం మండల కేంద్రంలో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్ తలకు గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడిన అశోక్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుల వద్ద లభించిన కార్డుల ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.



రేపటి నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

- రంగారెడ్డిలో 437 మంది
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 143 మంది ఎంపిక

మేడ్చల్ ప్రతినిధి /రంగారెడ్డి అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వేయర్ల కొరత దృష్ట్యా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అనే నిబంధన ఉండటంతో రాష్ట్రంలోని భూములన్నీ సర్వే చేసి మ్యాప్‌లు రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సర్వేయర్ల కొరత కారణంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లతో భూసర్వే చేయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఎంపిక చేసింది. ఈ నెల 17వ తేదీ వరకు లైసెన్స్‌డే సర్వేయర్ల నుంచి మీసేవల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లాలో 437మంది, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 143మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను అధికారులు ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 26 నుంచి 50 రోజుల పాటు అధికారులు శిక్షణ ఇస్తారు. రంగారెడ్డి జిల్లాలో ఎంపికైన 437మందికి ముచ్చింతల్‌లోని స్వర్ణభారతి ట్రస్ట్ భవనంలో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 143మందికి శామీర్‌పేటలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శిక్షణ ఇస్తారు. ఎంపికైన వారి వివరాలను అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. సమాచారాన్ని అభ్యర్థులకు చేరవేశారు. రెండు నెలల పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఎంపికైన లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. అభ్యర్థులు సోమవారం ఉదయం 10గంటలకు దరఖాస్తుతో జత చేసిన పత్రాలను వెంట తీసుకురావాలి. మొదట సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత శిక్షణ ఇస్తాం. భూ కొలతలకు సంబంధించి ఎటువంటి సామగ్రి ప్రభుత్వం ఇవ్వదు. అన్నీ ట్రైనీ సర్వేయర్లే సమకూర్చుకోవాలి.

- శ్రీనివాస్, ఏడీ

శంకర్‌పల్లి మున్సిపాలిటీకి పురస్కారం

ఉత్తమ పర్యావరణ అవార్డుకు ఎంపిక

శంకర్‌పల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఉత్తమ పర్యావరణ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్రంలోని ఐదు మున్సిపాలిటీలతో పాటుగా శంకర్‌పల్లి మున్సిపాలిటీని ఈ అవార్డు వరించింది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ అవార్డును ప్రకటించినట్లు శనివారం శంకర్‌పల్లి కమిషనర్ యోగేష్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆడిటోరియం (సనత్‌నగర్)లో ఈ అవార్డును అధికారుల చేతుల మీదుగా తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

జన్వాడలో ముగిసిన హార్స్ రైడింగ్ పోటీలు

- సమ్మర్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్ షిప్‌లో పోటీపడిన 500మంది రైడర్లు
- నాసర్ పోలోలో ఉత్కంఠభరితంగా జరిగిన గేమ్స్

శంకర్‌పల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): జన్వాడలోని నాసర్ పోలోలో జరిగిన సమ్మర్ రైడింగ్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్ షిప్ పోటీలు శనివారం ముగిశాయి. మే 22న ప్రారంభమైన ఈ పోటీలలో సుమారు 500మంది పాల్గొన్నారు. షో జంపింగ్, డ్రెసేజ్ వంటి ఈక్వెస్ట్రియన్ ఈవెంట్‌లలో పలువురు ఔత్సాహిక యువ రైడర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్-10, అండర్-16 అలాగే ఓపెన్ కేటగిరీలో 45సెంటీమీటర్ల జంపింగ్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. నాసర్‌పోలో అండ్ ఈక్వెస్ట్రియన్ అకాడమీ, రాయల్ కబాలో, రాంచో డి కబాలో, ఆర్బీ రైడింగ్, క్లబ్ హైదరాబాద్ ఈక్వెస్ట్రియన్ సెంటర్, స్టాలియన్ క్లబ్, తెలంగాణ హార్స్ రైడింగ్ క్లబ్‌లు ఈ ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్నాయి. నిర్వాహకులు మీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇలాంటి పోటీలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటుగా ఇంటర్నేషనల్ లెవల్‌కు సన్నద్ధమయ్యేందుకు దోహదపడతాయని ఆయన అన్నారు.



గుర్రంతో జంపింగ్ చేస్తున్న ఐజామీర్

భట్టి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- రేపు తలకొండపల్లిలో పర్యటించనున్న డిప్యూటీ సీఎం
- ఇంటిగ్రేటెడ్ పాఠశాల, విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

తలకొండపల్లి, మే24(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండలంలో ఈ నెల 26న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించనున్నారని, ఈ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఖానాపూర్‌లో ఆయన మాట్లాడుతూ... గ్రామంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్, రూ. 40 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. ఆయా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేస్తున్నట్లు చెప్పారు. అలాగా నూతనంగా మంజూరైన ఎనిమిది సబ్‌స్టేషన్లకు ఒకేచోట శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. భట్టి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జున, విద్యుత్ శాఖ డీఈ గోపాలకృష్ణ, ఏడీఈ బాలకృష్ణ, ఏఈ విజయ్, విద్య మౌలిక సదుపాయాల కల్పన ఎల్‌సీ షఫీ, ఈఈ రాంచందర్, డీఈ ప్రతాప్, మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.



పాతికేళ్ల కల.. నెరవేరుతున్న వేళ!

- చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జికి మోక్షం
- రూ.184 కోట్లు మంజూరు
- ఆరునెలల్లో పూర్తికి ప్రణాళిక
- హర్షం వ్యక్తం చేస్తున్న షాద్‌నగర్ వాసులు

9

కాపీ కొడుతూ బుక్కైన ముగ్గురు విద్యార్థులు

వికారాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలకు 235 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, కాపీ కొడుతూ ముగ్గురు ఫస్టియర్ విద్యార్థులు పట్టుబడ్డారు. మ్యాథ్స్-1ఏ, బాటనీ, పొలిటికల్ సైన్స్ ఫస్టియర్ పరీక్షలకు 3314 మంది విద్యార్థులకు 3,137 మంది హాజరు కాగా, వారిలో 174 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 3050 మందికి 2887 మంది హాజరు కాగా, 160 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 264 మంది విద్యార్థులకు 250 మంది హాజరు కాగా, 174 మంది గైర్హాజయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకెండియర్ పరీక్షలకు 1033 మందికి 972 మంది విద్యార్థులు హాజరు కాగా, 61మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 953 మందికి 895 మంది హాజరు కాగా, 58 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 80 మంది విద్యార్థులకు 77 మంది హాజరు కాగా, 61మంది గైర్హాజరయ్యారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్‌పై ఫిర్యాదు

తాండూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాతపై తాండూరు పట్టణ బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, పటేల్ విజయ్‌కుమార్ తదితరులు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి శనివారం ఫిర్యాదు అందజేశారు. కాల్వ సుజాత.. తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి ప్రధాని నరేంద్ర మోదీని అగౌరవపరిచేలా వీడియోచేసి పోస్ట్ చేశారని పేర్కొన్నారు. మోదీ మనోభావాలు దెబ్బతిసేలా సుజాత వ్యవహరించారన్నారు. అంతేకాకుండా ప్రధానిమోదీ.. పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ ఒడిలో కూర్చున్నట్లుగా తయారు చిత్రాన్ని పోస్టుచేశారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ప్రధాని, దేశ పౌరుల మనోభావాలకు భంగం కలిగించేలా రూపొందించిన పోస్టును సోషల్ మీడియా నుంచి తొలగించాలని కోరారు. ఫేక్ పోస్టు చేసిన కాల్వ సుజాతపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు పోలీసులను డిమాండ్ చేశారు.

రూ.16కోట్లతో చిలుకవాగు పనులు

తాండూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ముంపు ప్రాంతాల్లోని ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు రూ.16కోట్ల వ్యయంతో చిలుక వాగు ప్రక్షాళన చేపట్టినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆయన చిలుక వాగు పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాది లోపే ఎన్నో ఏళ్ల పెండింగ్‌లో ఉన్న చిలుకవాగు ప్రక్షాళన పనులను చేపట్టామన్నారు. సాయిపూర్ ప్రాంతంలో పనులు మొదలయ్యాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో చిలుకవాగు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అతిత్వరలో పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేసి ముంపు ప్రాంతాల ప్రజల బాధలు తీరుస్తానని చెప్పారు.


చిలుకవాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

వ్యవసాయమే జీవనం.. అందరికీ ఆదర్శం

● ఆధునిక సాగులో రాణిస్తున్న కంది సోదరులు


రాజేందర్‌రెడ్డి సాగుచేస్తున్న వంకాయ తోట

మంచాల, మే 24(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధి జాపాల గ్రామానికి చెందిన కందిమల్ల రాజేందర్‌రెడ్డి, కందిమల్ల శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరు అన్నాదమ్ముళ్లు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఇంటర్ వరకు చదువుకున్న వీరు చిన్నప్పటి నుంచి తండ్రి కందిమల్ల రంగారెడ్డికి వ్యవసాయం, పశుపోషణలో చేదుడువాదోడుగా ఉండేవారు. ఇలా వారికి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు. సంప్రదాయ సాగు విధానాలపై అవగాహన ఏర్పర్చుకున్నారు. తోటివారంతా పైచదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు చేయాలనే ఆలోచనలు చేస్తుండగా, ఈ బ్రదర్స్ మాత్రం సమయం వృథా చేయకుండా తమకిష్టమైన వ్యవసాయ రంగాన్నే ఎంచుకున్నారు. వారికున్న ఆరు ఎకరాలకు తోడుగా పక్కనే ఉన్న మరో పదెకరాల వ్యవసాయ భూమిని లీజుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. సాగులో ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ నాణ్యమైన దిగుబడులు పొందుతున్నారు. వారు పండించే కూరగాయలను స్వయంగా మార్కెట్ తరలించే అక్కడే హోల్‌సేల్‌గా అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు.

సమీప రైతులకూ సాయం

కంది సోదరులు సొంత పనులు చూసుకోవడమే కాదు.. ఇతర రైతులకూ సాయం అందించడంలో ముందుంటారు. అలాగే వీరికి చిన్నప్పటి నుంచి గేదెలు, ఆవులను సాకుతూ డెయిరీ ఫాం నిర్వహించిన అనుభవం కూడా ఉంది. పశుపోషణపై కందిమల్ల శ్రీనివాస్‌రెడ్డికి మంచి అవగాహన ఉంది. పాడి ఆవులకు వచ్చే రోగాలను వెంటనే గుర్తించి వాటికి సకాలంలో చికిత్సలు చేస్తుంటాడు. గ్రామానికి చెందిన రైతులు అత్యవసర సమయాల్లో శ్రీనివాస్‌రెడ్డిని వెంట తీసుకెళ్లి పాడిఆవులకు చికిత్స చేయించుకుంటారు. అంతేగాకుండా సోదరులిద్దరు అక్షరాస్యులు కావడంతో పంటల సాగులో కొత్తగా వచ్చే ఆధునిక విధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ మార్కెట్‌కు వచ్చిపోయే సమయాల్లో తోటి రైతులకు వివరిస్తుంటారు.

వ్యవసాయాన్నే జీవనంగా ఎంచుకున్నాను



మధ్య తరగతి కుటుంబం కావడంతో పైచదువులు సాధ్యం కాలేదు. వ్యవసాయం కాకుండా ఏదైనా చేయొచ్చు కదా అని చాలామంది అనేవారు. కానీ ఇతరులపై ఆధారపడకుండా బతకాలనే సంకల్పంతో నాకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవాలని నిర్ణయించుకున్నాను. కొత్తగా వేరే రంగంలోకి వెళ్లేది ఎందుకుని చిన్నప్పటి నుంచి తెలిసిన వ్యవసాయన్నే జీవనోపాధిగా ఎంచుకున్నాను. డ్రిప్, తుంపర, మల్చింగ్, పందిరి సాగు పద్ధతుల్లో కూరగాయలను పండిస్తున్నాను. దీంతో తక్కువ నీటితోనే సాగు సాధ్యమవుతోంది. పేరొందిన కంపెనీల నుంచి ఆన్‌లైన్‌లో కొత్తరకం విత్తనాలను బుక్ చేసుకుని సేకరిస్తుంటాం. పంట దిగుబడులు అలాగే వస్తాయి. నాణ్యమైన కూరగాయలు పండిస్తాం కాబట్టి మార్కెట్‌లో ముందుగానే అమ్ముడుపోతాయి.

- కందిమల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆదర్శ రైతు

రైతుబజార్‌లో స్వయంగా అమ్ముతాం



అందుబాటులో ఉన్న నీటి వనరులతోనే కూరగాయలు పండిస్తాను. పొలం పనులకు నా భార్యకూడా తోడుగా వస్తుంది. మాతో పాటు రోజువారీగా నలుగురు కూలీలకు ఉపాధి కల్పిస్తాం. పండించిన పంటలను ఎప్పటికప్పుడు ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు తరలిస్తాను. అంతేగాకుండా ఈ కూరగాయలను నేనే స్వయంగా వనస్థలిపురం రైతుబజార్‌లో అమ్ముకుంటాను. కూరగాయలు తాజాగా ఉండడంతో రెగ్యులర్ కస్టమర్లతో వెంటవెంటనే అమ్ముడు పోతాయి.

- కందిమల్ల రాజేందర్‌రెడ్డి, రైతు, జాపాల

క్రీడలతో స్నేహభావం పెంపు


మన్నెగూడలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులతో అనిల్‌రెడ్డి

పూడూరు, మే 24, (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మన్నెగూడలో రైయిస్‌ఖాన్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల అనిల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. యువతలో ఉన్న క్రీడా ప్రతిభకను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మన్నెగూడలో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానన్నారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయిలో పరిగి నియోజకవర్గానికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు మల్లేశం, మండల నాయకులు దేవన్గూడ వెంకటయ్యా, సత్యనారాయణ, బుచ్చన్న, జహీర్, దయానందగౌడ్, వినోద్‌గౌడ్, భాస్కర్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు పరిశోధనలు ముఖ్యం



పట్టా ప్రదానం చేస్తున్న వీసీ శంకర్‌లింగం

మొయినాబాద్ రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు పరిశోధనలు కూడా ఎంతో ముఖ్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శంకర్ లింగం తెలిపారు. హిమాయత్ నగర్‌లోని యూనివర్సిటీకి చెందిన కన్నెంటి ప్రవీణ్ కుమార్ కెమిస్ట్రీలో ప్రొఫెసర్ టి.నర్సింహస్వామి పర్యవేక్షణలో 'డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ న్యూస్ ఇమిడేజోల్ డేరివేటివ్స్ యాస్ యాంటీ క్యాన్సర్ ఏజెంట్స్‌పై పరిశోధన పత్రం సమర్పించారు. ఈమేరకు శనివారం వీసీ శంకర్ లింగం ఆయనకు పీహెచ్‌డీ పట్టా అందజేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్, క్రిష్టోఫర్ రూబెన్, సుందర్‌రామ్, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

నిరుపేద కుటుంబాలను ఆదుకుంటాం


చెక్కు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

షాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ కింది పలువురికి రూ.3లక్షల 10వేల చెక్కులు మంజూరయ్యాయి. ఈమేరకు షాబాద్, చేవెళ్ల, పూడూరు మండలాలకు చెందిన బాధిత కుటుంబాలకు శనివారం ఆయన నగరంలోని నివాసంలో అందజేశారు.


సైనికులను అవమానించడం బాధాకరం


మాట్లాడుతున్న వెంకటేష్‌గౌడ్

మొయినాబాద్ రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ పేరిట భారత సైనికులు పాకిస్థాన్‌పై దాడులు చేసిన తరువాత వారు ఏం చేశారో వీడియోలు, ఫొటోలు ప్రపంచం ముందుపెట్టారని, అయితే, పాకిస్థానే సిగ్గుతో తలదించుకుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం సైనికులను అవమానపర్చినట్లు మాట్లాడుతోందని బీజేపీ ఓబీసీ సెల్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఎల్లని వెంకటేష్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో విలేఖరులతో మాట్లాడుతూ భారత సైనికులను అవమానపరిచేలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. సరిహద్దుల్లో దేశ భూభాగాన్ని కాపాడుతూ.. దైశ సమైక్యత, సమగ్రతలను నిలబెట్టే సైనికుల గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఇతర నాయకులు అనుమానించేలా.. అవహేళనగా మాట్లాడడం బాధాకరమన్నారు. సర్జికల్ స్ట్రైక్ విషయంలో ఆధారాలు చూపాలని గతంలో కేసీఆర్, కవితలు కూడా అడిగారని గుర్తుచేశారు. పీవోకేను ఎప్పటికైనా భారత్ స్వాధీనం చేసుకోవడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్‌లో దెయ్యాలు, కోవర్టులు ఎవరో ఎమ్మెల్సీ కవిత చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాపాలను ఎమ్మెల్సీ కవిత తన లేఖ ద్వారా బయటపెట్టారని అన్నారు.

















ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఆదిభట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ఇందరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. శనివారం ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని ప్రమిద గార్డెన్‌లో ఆదిభట్ల, తుర్కయంజాల్‌కు చెందిన లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో భాగంగా మొదటి దఫా పారిశుధ్య కార్మికులకు, దివ్యాంగులకు, వితంతులకు ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆదిభట్ల, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు 822 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. ఆలస్యం చేయకుండా వెంటనే గ్రౌండింగ్ పనులు మొదలు పెట్టాలని సూచించారు. నియోజకవర్గంలో వందల ఎకరాలు ప్రభుత్వం భూమి కబ్జాకు గురైందన్నారు. ఆ భూమిని పేదలకు పంచుతామన్నారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డీసీ నాయక్, ఆర్డీవో అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు బాలకృష్ణ, అమరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహిపాల్, లక్ష్మీపతిగౌడ్, ఈ.సీ శేఖర్‌గౌడ్, పాండురంగారెడ్డి, గౌని బాల్‌రాజ్, రంజిత్‌కాంత్, రాజు, మున్సిపల్ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి ప్రాధాన్యం

కులకచర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన చెంచు కుటుంబాలకు పీఎం జన్‌మన్ యోజన పథకం కింద 43 ఇళ్లు మంజూరయ్యాయి. సంబంధిత హౌజింగ్ ఏఈ హర్షవర్ధన్‌గౌడ్ శనివారంచెంచు కుటుంబాలను పరిశీలించారు. అంతారం గ్రామానికి ఎనిమిది, కుసుమసముద్రంకు 26ఇళ్లు పీఎం జన్‌మన్ యోజన పథకం కింద మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, అంజిలయ్యగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఎల్లప్ప, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల విచారణ

తాండూరు రూరల్, మే 23, (ఆంధ్రజ్యోతి): అంతారం తండాలో ఇందిరమ్మ ఇళ్లపై శనివారం మండల పంచాయతీ రాజ్ ఏఈ నందిని విచారణ జరిపారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఇందిరమ్మ ఇళ్లు పొందడానికి అర్హులా, వారికి భూమి ఎన్ని ఎకరాలు ఉంది, గతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులా, వార్షిక ఆదాయం ఎంత ఉంది, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబమేనా అనే విషయాలపై సమగ్ర విచారణ జరిపారు. ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం విచారణ జరిపినట్లు మండల పంచాయతీ రాజ్ ఏఈ, విచారణాధికారి నందిని తెలిపారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి అంబిక తదితరులున్నారు.


అంతారం తండాలో విచారణ జరుపుతున్న నందిని


సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మహేశ్వరం, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. శనివారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అవకతవకలకు తావులేకుండా చూసుకునే బాధ్యత ఇందిరమ్మ కమిటీలదేనన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ అమలు వంటి విషయాల్లో కాంగ్రెస్ చరిత్ర సృష్టించిందన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంతో బడుగు, బలహీన వర్గాలకు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అరాచకాలను వివరించాలని తెలిపారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, జంగారెడ్డి, కాకి ఈశ్వర్, నడికూడ శివ, రాజునాయక్‌తో పాటు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నృత్యోత్సవాల నిర్వహణ అభినందనీయం


మాట్లాడుతున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్, మే 24(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న జానపద కళలను వెలుగులోకి తేవడం అభినందనీయమని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఆర్ఎస్‌పీ ఆర్ట్స్ అకాడమీ కొడంగల్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రాఘవేంద్ర ఫంక్షన్ హాలులో మాధురి డ్యాన్స్ శిక్షణ శిబిరం ముగింపులో భాగంగా నృత్యోత్సవాన్ని నిర్వహించారు. వేడుకకు హాజరైన గుర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొదటిసారి కొడంగల్‌లో నృత్యోత్సవాలను నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఈ వేడుకను నిర్వహించిన ఆర్ఎస్‌పీ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ ప్రకాశ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 80మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌స్వామిజీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, వైద్యులు రవీందర్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ జాతీయ కో-ఆర్డినేటర్ కృష్ణంరాజు, కృష్ణయ్య, రమేశ్ మాస్టర్, రవిరాథోడ్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

బషీరాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానాకాలం సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. మరోవారం, పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో ముందస్తు వర్షాలతో రైతులు పంటసాగు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు మరోసారి దుక్కులు దున్ని, సేంద్రియ ఎరువులు చల్లే పనుల్లో బిజీగా ఉంటున్నారు. ఇప్పటికే సాగుకు పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు పెట్టుబడుల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద రుణ ప్రయత్నాలు మొదలుపెట్టారు.

పాతికేళ్ల కల.. నెరవేరుతున్న వేళ!


పాత నిర్మాణం రైల్వే బ్రిడ్జి

చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జికి మోక్షం.. రూ.184 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వాలు

ఆరునెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక.. హర్షం వ్యక్తం చేస్తున్న షాద్‌నగర్ వాసులు

షాద్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పది నిమిషాలకు ఒక రైలు వస్తుంది.. పదేపదే గేటు మూసివేస్తారు.. రైలు వెళ్లే వరకు ఆ దారి వెంట వెళ్లే వాహనదారులు, ప్రజలు గంటల తరబడి వేచిచూడాలి. ఇదీ నిత్యం చటాన్‌పల్లి రైల్వే గేటు సమీపంలో జరిగే తంతు. రైల్వే బ్రిడ్జి లేకపోవడంతో ఈ ప్రాంతంలో ప్రజలు నరకం చూస్తున్నారు. షాద్‌నగర్ పట్టణం నుంచి బైపాస్‌కు, పలు గ్రామాలకు వెళ్లాలంటే ఇదొక్కటే మార్గం. ఈ గేటు సమీపంలో వంతెన నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు నాయకులు హామీ ఇస్తున్నారే తప్పా బ్రిడ్జి నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. కానీ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో వైజంక్షన్ నిర్మాణానికి మోక్షం లభించింది. వంతెన నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడంతో స్థానికులతో పాటు, బైపాస్ మీదుగా వెళ్లే పలు గ్రామాలకు చెందిన ప్రజలు, వాహనాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే బ్రిడ్జికి నిధులు మంజూరైన విషయం తెలుసుకున్న చటాన్‌పల్లి గ్రామ ప్రజలతో పాటు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనతరం ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు.



ఏళ్లుగా ఎదురుచూపు

షాద్‌నగర్ రైల్వే గేట్ వద్ద వంతెన నిర్మించాలన్నది పాతికేళ్ల కల.. దీనికోసం అప్పటి ప్రజాప్రతినిధులు మొదలుకుని ఇప్పటి ఎమ్మెల్యే వరకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలిపోయింది. షాద్‌నగర్ మీదుగా రోజుకు 40కు పైగా ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైల్లు వెళ్తుంటాయి. దాంతో రైలు రావడానికి 10 నిమిషాల ముందే గేట్‌ను మూసేస్తారు. దీంతో అప్పటికే కొన్ని వందల వాహనాలు గేట్ వద్ద బారులు తీరుతుంటాయి. గేట్ తెరిచిన తర్వాత ట్రాక్ దాటాలంటే వాహనదారులకు కనీసం 40నిమిషాల సమయం పడుతుంది. ఈలోపే మరో రైలు వస్తే మళ్లీ గేటు మూసేస్తారు. ఇలా నిత్యం గేటు వద్ద వాహనదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. కనీసం అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి. సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వంతెన నిర్మాణానికి కృషిచేశారు. పనులు కూడా మొదలు పెట్టారు. కాని ఆ వంతెన నిర్మాణం కేవలం గేటు దాటడానికి మాత్రమే ఉపయోగపడుతుందని, వంతెన మీదుగా పరిసర గ్రామాలైన బుచ్చిగూడ, దూసకల్, వెలిజర్ల, ఎక్లాస్‌ఖాన్‌పేట్, జేపీదర్గా లాంటి ప్రదేశాలకు వెళ్లాలంటే వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వంతెన నిర్మాణం పనులను నిలుపుదల చేయించారు. కేవలం 'ఫై' వంతెన మాత్రమే కాకుండా 'వై' వంతెన నిర్మించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి రైల్వే శాఖ అధికారులు కూడా సమ్మతించారు.

రూ.184 కోట్లు మంజూరు..

'వై' వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే అటు రైల్వే శాఖ, ఇటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపారు. రైల్వేగేట్ వద్ద వాహనదారులు, సాధారణ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితిని అర్థం చేసుకున్న రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు 'వై' జంక్షన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.184 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవో నెంబర్ 245 ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే నిర్మాణం పనులు చేపట్టి ఆరు నెలల్లో బ్రిడ్జిని అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఇచ్చిన హామీని నెరవేర్చాను



ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాను. ఇది ప్రజల గొప్పతనం. ప్రజా అవసరాలను తీర్చగల వ్యక్తిని గుర్తించి ఓటు వేసి గెలిపించినందుకు ఇప్పుడు ఫలితం దక్కింది.. ప్రజాప్రతినిధులు ఏసీ గదుల్లో కూర్చుంటే పనులు జరగవు. ప్రజల వద్దకు వెళ్లి వారి అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటిని పరిష్కరించాలి. ఆర్‌వోబీ నిర్మాణం నా కల. అది నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఉంది.

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్

ఆర్‌వోబీకి గ్రీన్ సిగ్నల్ రావడం హర్షణీయం



చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలపడం హర్షణీయం. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నేను కూడా పలు మార్లు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశాను. ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణంతో వాహనదారుల ఇబ్బందులు తొలగనున్నాయి. పనుల్లో జాప్యం లేకుండా వేగవంతంగా నిర్మాణం పూర్తి చేయాలి.

- నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

అధైర్య పడొద్దు అండగా ఉంటా

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


నందిగామ : మేకగూడలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, మే 24(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు అధైర్యపడవద్దని ఎలాంటి కష్టమొచ్చినా అండగా ఉంటానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మండలంలోని మేకగూడ, సంఘిగూడలో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే నాయకులతో కలసి భూమి పూజ చేశారు. మొదటివిడతలో మేకగూడలో 10, సంఘిగూడలో 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. మేకగూడలో రూ.20లక్షలతో మైనారిటీ భవనం, బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.25లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సహకారంతో మేకగూడలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు, సోలార్ లైట్లు, మహిళా సమాఖ్య అభివృద్ధికోసం శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సంఘిగూడలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు, రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో సుమతి, నాయకులు జంగ నర్సింలు, శివశంకర్‌గౌడ్, విఘ్నేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, సూక్యనాయక్, బండారి రాజు, నర్సింహరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, శ్రీను, మల్లేష్, సత్యనారణరెడ్డి, దామోదర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, నర్సింహ్మా, యాదయ్య, సత్తయ్య, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

షాద్‌నగర్ అర్బన్ : రైతులకు కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సమావేశ హాలులో శనివారం డివిజన్ స్థాయి విత్తనాల, ఎరువుల, క్రిమి సంహారక మందుల డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. షాద్‌నగర్ ఏడీఏ నిషాంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించడానికి వ్యాపారులు చొరవ చూపాలని, ఆ దిశగా వ్యవసాయాధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. డీఏవో నర్సింహారావు మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో ఏర్పాటవుతున్న మండల టాస్క్‌ఫోర్స్ బృందాలు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేస్తాయని చెప్పారు. నకిలీ, కల్తీ విత్తనాలు విక్రయించే వారి సమాచారం తమకు ఇవ్వాలని షాద్‌నగర్, శంషాబాద్ ఏసీపీలు ఎస్.లక్ష్మీనారాయణ, శ్రీకాంత్‌గౌడ్ కోరారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.

బహుళ జాతి సంస్థల సేవలు అజరామరం

కొత్తూర్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో సమాజ సేవ చేయడానికి బహుళ జాతి సంస్థలు ముందుకు రావడం అజరామరమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఇన్ముల్‌నర్వలో మైక్రోసాఫ్ట్ సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ లెర్నింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే క్రికెట్ టోర్నీని ప్రారంభించి, విజేతలకు షీల్డ్‌లను బహూకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బహుళజాతి సంస్థలు సీఎస్ఆర్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలతో పాటు, అభివృద్ధి పనులు చేపట్టడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన చందన, భరత్, రాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవికుమార్‌గుప్త, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, శంకర్‌నాయక్, ఖాజు, శేఖర్‌గుప్త, ప్రేమ్‌నాయక్, హబీబ్, బాసునాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

ఇన్ముల్‌నర్వ గ్రామంలో పలువురు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఎమ్మెల్యే ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. పలువురు మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.



కనువిందు చేసిన పాంబండ

కులకచర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): సూర్యుడి కాంతిలో మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శోభాయమానంగా కనువిందు చేసింది. శనివారం ఉదయం 8గంటల ప్రాంతంలో మేఘాలు కమ్ముకొని చుట్టూ ప్రాంతం అంతా చీకటిగా మారింది. అదే సమయంలో సూర కాంతి కేవలం పాంబండపైనే పడింది. సూర్యుడి ఎర్రని కాంతిలో పాంబండ చూపరులను ఆకట్టుకుంది. భక్తులు, యాత్రికులు సూర్యుడి కాంతిలో కనిపించిన పాంబండను తమ సెల్ ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.

వైభవంగా గోదారంగనాయక స్వామి కల్యాణం

షాద్‌నగర్ రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద శివారులోని రంగదాములలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయక స్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రామా చార్యుల బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై కల్యాణం తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో శివకుమార్,వెంకటేష్ గుప్త, అనుమారి వెంకటయ్య, ర్యాకల మల్లేష్, చంద్రశేఖర్, యాదగిరి పాల్గొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న పండితులు

డీఎస్ఆర్‌పై అభ్యంతరం

తాండూరు, మే 24(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పంచాయతీల్లో న్యూ డీఎస్ఆర్‌పై సిబ్బంది అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. డీఎస్ఆర్ అప్‌డేట్ చేయకుండా తాండూరు పంచాయతీ కార్యదర్శులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఫేస్ రికగ్నైజేషన్, తంబ్ విషయంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీల్లో సాధ్యం కాదంటున్నారు. ఈమేరకు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అప్పటి వరకు డీఎస్ఆర్ యాప్‌ను ఉపయోగించకూడదని పంచాయతీ కార్యదర్శుల సంఘాలు నిర్ణయించారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర

ధారూరు, మే24(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మండలంలో తిరంగా యాత్ర నిర్వహించారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రం పహల్గామ్‌లో ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు తిరంగా యాత్ర చేపట్టారు. నాగారంలోని తుల్జాభవానీ ఆలయంలో పూజలు చేసి యాత్ర ప్రారంభించారు. జాతీయజెండాతో నాగారం, మైలారం, తరిగోపుల, జైదుపల్లి, కేరెల్లి, ధారూరు, అవుసుపల్లి, కుక్కింద, గడ్డమీది గంగారం, నాగసమందర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాజునాయక్, నాయకులు పాండుగౌడ్, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్, నరోత్తంరెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేష్, రవీందర్‌గౌడ్, జగదీశ్వర్, విజయలక్ష్మి, సాయిగౌడ్, అంజయ్య, ఉలేందర్, స్థానికులు పాల్గొన్నారు.


వికారాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో విజయోత్సవ సంబురాలు

విజయోత్సవ సంబురాలు

వికారాబాద్ : పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా భారత త్రివిధ దళాలకు మద్దతుగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో గణిత ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణా కేంద్రంలో విజయోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణిత శిక్షణ తరగతుల కోర్సు డైరెక్టర్ జాకా వెంకటేశం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొత్తగడి అంజిరెడ్డి, మహేంద్ర బహదూర్, ఎం ప్రతాప్, సత్యనారాయణరెడ్డి, శ్రీధర్ రెడ్డి, బసప్ప, సతీష్ కుమార్, గణిత రిసోర్స్ పర్సన్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పరిగి: ర్యాలీలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పరిగిలో ర్యాలీ

పరిగి: ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో దేశ సైనికులకు మద్దతుగా, అమర జవాన్లకు నివాళిలో భాగంగా శనివారం సాయంత్రం పరిగిలో భారీ తిరంగా ర్యాలీని నిర్వహించారు. పరిగి పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరదేవాలయం నుంచి ప్రధాన వీధుల గుండా గాంధీచౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. అన్ని రాజకీయ పార్టీలు, అన్ని సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లింగసమానత్వంపై విద్యావంతుల పాత్ర కీలకం

లింగ సమానత్వంపై విద్యావంతుల పాత్ర కీలకమని పరిగి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప అన్నారు. పరిగిలోని జడ్పిహెచ్ఎస్ నంబర్ 1 పాఠశాలలో ఉపాధ్యాయులకు శనివారం చట్టాలపై అవగాహన సదస్సు, ఆపరేషన్ సిందూర్ సక్సెస్‌లో భాగంగా జాతీయపథాకాల ప్రదర్శన, అనంతరం రిటైర్డు ఆర్మీఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, రిసోర్స్ పర్సన్లు చిన్నకృష్ణ, ఎండీ ఉస్మాన్అలీ, ఆర్మీ రిటైర్డు జవాన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కావలి లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

★ I, KANURI SATYA SRI D/o KANURI SRINIVASA RAO, R/o 21-54/6, P-31, Sri Balaji Complex 3 floor, Huda Plots, RB Nagar, Shamshabad, K.V.Rangareddy, Telangana - 501218 Have changed my Religion from HINDUISM to ISLAM RELIGION wef-05/05/2025, also changed my name to SHAIK ZOYA AJH-58305

కావలెను

★ నిరుద్యోగ యువతీ యువకులకు జీవితంలో ఆర్థికంగా స్థిరపడే గొప్ప వ్యాపార అవకాశం కలదు. ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి. సెల్: 9059962194 AJH-15176

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రోడ్డు బాగు చేయరా?



నిరసన తెలుపుతున్న నరేష్‌కుమార్

శంకర్‌పల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): ఫత్తేపూర్-శంకర్‌పల్లి రోడ్డును ఇంకెప్పుడు బాగు చేస్తారని, వెంటనే అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలని శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్‌కుమార్ డిమాండ్ చేశారు. పూర్తిగా పాడైన ఫత్తేపూర్-శంకర్‌పల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ శంకర్‌పల్లి నుంచి ఫత్తేపూర్ వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఇంకెప్పుడు పూడ్చుతారని అధికారులను ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలు పోతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులకు పట్టడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయాలని, లేనిచో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు. వేనేంద్రచారి, మహేందర్‌రెడ్డి, రాజు, రవి, గంగాధర్, తదితరులున్నారు.

ఘనంగా మహేశ్‌కుమార్‌గౌడ్ బర్త్ డే

ఆమనగల్లు/కడ్తాల్, మే 24(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో శనివారం జరుపుకున్నారు. కాంగ్రెస్ మండల, పట్టణాధ్యక్షులు జగన్, మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండ్లీ రాములు ముఖ్య అతిథులుగా హాజరై కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కడ్తాల మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేసి ప్రజలకు పెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. చేగూరి వెంకటేశ్, రాజేశ్, సత్యం యాదవ్, మల్లేశ్, జహంగీర్‌బాబా, లక్పతినాయక్ తదితరులున్నారు.



ఆమనగల్లులో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్కింగ్ అడ్డాలుగా ప్రధాన రహదారులు

- ఆమనగల్లులో పట్టణంలోని హైవేలపై ఇష్టారాజ్యంగా వాహనాల నిలుపుదల
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు!
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పార్క్ చేసిన వాహనాలు

ఆమనగల్లు, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ పార్కింగ్ అడ్డాలుగా మారాయి. ఎవరి పట్టింపు లేక వాహనాదారులు రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దాంతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలుగుతోంది. అనేక సార్లు ప్రమాదాలు సైతం చోటు చేసుకున్న సంఘటనలున్నాయి. రాష్ట్ర రాజధానికి చేరువలో నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లు పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. వాహనాల సంఖ్య సైతం ఏటేటా ఎక్కువవుతోంది. వ్యాపారం, ఉద్యోగం, చదువుకోవడానికి, క్రయ విక్రయాల నేపథ్యంలో వందలమంది ద్విచక్ర వాహనాలతో పట్టణాలకు వస్తుంటారు. గంటల తరబడి వాహనాల పార్కింగ్‌తో దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాలు దెబ్బతింటున్నాయని కొందరు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధీనంలో ఉన్న శ్రీశైలం-హైదరాబాద్ రహదారిని దశాబ్దం క్రితం జాతీయ రహదారిగా మార్చి రోడ్డును విస్తరించారు. అయినప్పటికీ ఆక్రమణలు, వాహనాల పార్కింగ్‌తో రోడ్లు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు బస్టాండ్‌ఎదుట ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికుల కోసం ప్రధాన రహదారి మధ్యలోనే వాహనాలు నిలుపుతున్నారు. రాజీవ్ చౌక్ నుంచి మార్కెట్ యార్డు వరకే ఎక్కువ దుకాణాలు, హోటళ్లు, వ్యాపార వాణిజ్య సముదాయాలు ఉండడంతో ఎక్కువ రద్దీ ఉంటోంది. దాంతో వందల ద్విచక్రవాహనాలు రోడ్డు వెంట ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాడ్గుల, షాద్‌నగర్ రహదారులు కూడా పార్కింగ్ స్టాండ్‌గా మారాయి. రాజీవ్ చౌక్ నుంచి షాద్‌నగర్ రోడ్డులో బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో వాహనాల పార్కింగ్ బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లలేని పరిస్థితి. మాడ్గుల రోడ్డులో గాంధీచౌక్ వరకు వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. అధికారులు ఆక్రమణలను తొలగించి, అడ్డగోలుగా పార్కింగ్‌లు చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఆమనగల్లు పట్టణంలో ప్రధాన రహదారులపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాం. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బస్టాండ్ ఎదుట వాహనాలు నిలపకుండా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశాం. రోడ్లపై నిలుపుతున్న వాహనాలకు చలాన్లు విధిస్తున్నాం. ఎన్‌హెచ్‌ఏఐ, మున్సిపాలిటీ అధికారులతో కలిసి ఆక్రమణల తొలగింపు, రోడ్లపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్, ఎస్సై, ఆమనగల్లు

పెద్దషాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- హెడ్ కానిస్టేబుల్ మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- రెండు పోలీసులు వాహనాలను ఢీకొన్న లారీ



విజయ్‌కుమార్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండల పరిధిలోని పెద్దషాపూర్ ఎస్‌వీఎస్ గార్డెన్ వద్ద హైదరాబాద్-బెంగళూర్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దషాపూర్ వద్ద ఓ లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొందని డయల్ 100కు కాల్ వచ్చింది. దాంతో అప్రమత్తమైన పోలీసులు.. హైవే పెట్రో మొబైల్, శంషాబాద్ రూరల్ పెట్రో మొబైల్ వాహనాల్లో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈక్రమంలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వస్తున్న మరో లారీ రెండు పెట్రోల్ మొబైల్ వాహనాలను ఢీకొంది. దాంతో హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్(42) అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురు కానిస్టేబుళ్లు శ్రీనివాస్, యాదయ్యతో పాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆస్పత్రికి తరలించారు. ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐ నరేందర్‌రెడ్డి గాయపడిన వారిని పరామర్శించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

చేవెళ్ల, మే 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో బైక్ రావడంతో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని ఎర్రగడ్డపల్లి గ్రామానికి చెందిన రాజాపురం దేవరాజు(49) నగరంలోని హైటెక్ సిటీలో నివాసముంటూ వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం బైక్‌పై స్వగ్రామానికి వెళ్లి తిరిగి రాత్రి సమయంలో నగరానికి వస్తుండగా చేవెళ్ల మండల పరిధి మీర్జాగూడ గేట్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ప్రమాదంలో దేవరాజు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు దేవరాజు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి



ఇబ్రహీంపట్నం : ముకునూరులో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డా.రజనీకాంత్



నందిగామ : బ్రోచర్‌ను విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఇబ్రహీంపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): పంటలకు విచ్చలవిడిగా పురుగు మందులు వాడవద్దని, పంట మార్పిడితో అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.రజనీకాంత్, డా.అరుణశ్రీలు రైతులకు సలహా చేశారు. ముఖ్యంగా ఆకుకూరలు, కాయగూరల్లో పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ముకునూరు రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు పాల్గొని పంటల సాగుపై తగు సలహాలు, సూచనలు చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త డా.వెంకట్రామ్, పశు వైద్యాధికారి అనంద్‌రెడ్డి, ఏవో విద్యాధరి, ఏఈవో సృజన, కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులున్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

నందిగామ : రైతులు రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులతో పంటలను సాగు చేయాలని శాస్త్రవేత్త చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని శ్రీనివాసులగూడ, అప్పారెడ్డిగూడలో రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయంపై అవగాహన అంశాలతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు రామశివ, రవి, శాస్త్రవేత్తలు నరసింహ, కృష్ణయ్య, సత్యనారాయణ, మల్లేష్, రామ్‌గోపాల్, భారతి, రాకేష్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నీటి గుంత.. తీరును చింత!

(ఏడో పేజీ తరువాయి)

రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నీటి తవ్వకాలతో భూగర్భ జలాల పెరుగుదలతో వ్యవసాయ రంగానికి, పశు పక్షాదులకు నీటి ఇబ్బంది తొలగిపోతుందని వివరిస్తున్నారు. అలాగే చేపల పెంపకం ద్వారా ఉపాధి పొందవచ్చని, కూలీలకు ఉన్న ఊళ్లోనే వంద రోజుల పని దొరుకుతుందని తెలియజేస్తున్నారు. నీటి కుంటల తవ్వకాలు ఓ ఉద్యమంలా చేపట్టేందుకు అధికారులు ముందుకు సాగుతున్నారు. అడవులు నరికివేత కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిని, నీటి వనరులు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తద్వారా మానవజాతే కాకుండా జంతువులు, పశుపక్షాదులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో నీటి సాంద్రత, భూగర్భ జలాలు పెరిగేలా ఉపాధిహామీ పథకంలో ఫామ్‌పాండ్స్ (నీటి కుంటలు) తవ్వకాలు చేపడుతున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేలా అటవీ ప్రాంతాలు, ప్రభుత్వ స్థలాలు, రైతుల వ్యవసాయ పొలాల్లో నీటి కుంటలు నిర్మించాలని నిర్ణయించారు.

14 మండలాల్లో ముమ్మరంగా తవ్వకాలు

జిల్లాలో మొత్తం 27 మండలాలు ఉండగా, అందులో గ్రామీణ మండలాలు 21 ఉన్నాయి. ఇందులో ఏడు మండలాలు మినహా 14 మండలాల్లో నీటి కుంటల తవ్వకాలు ఊపందుకున్నాయి. 2022-23 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 293 నీటి కుంటల తవ్వకాలకు రూ.4,48,75,095 ఎస్టిమేట్ కాస్ట్ నిర్ణయించారు. ఇప్పటివరకు 80శాతం నీటి కుంటల తవ్వకాలు పూర్తయ్యాయి. నేల స్వభావం ఆధారంగా వీటిని నిర్మిస్తున్నారు. 12/12 నీటికుంట లోతు.. రెండు మీటర్లకు రూ.లక్ష, 20/20 నీటి కుంట లోతు.. మూడు మీటర్లకు రూ.3లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈ నీటి కుంటల్లో మత్స్యకారులు చేపలను పెంచుకునే అవకాశం కల్పిస్తున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ సీతారాం, శమంత ప్రభాకర్‌రెడ్డి

కందుకూరు, మే 24(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు దోహదపడతాయని సీఐ సీతారాం అన్నారు. మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి సొంత నిధులు రూ.45 వేలతో నేదునూరు గేటు, నేదునూరులో ఏర్పాటు చేయించిన సీసీ కెమెరాలను ఎస్సై సైదులుతో కలిసి శనివారం సాయంత్రం ప్రారంభించారు. అఫ్జల్‌బేగ్, పాండురంగారెడ్డి, బొర్ర సురేష్, వి.బాబు, పుష్పదర్శన్, మంజుల బాబు, జి.సంజీవరెడ్డి, ఎగిరిశెట్టి నర్సింహ, అజారుద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గం

టీడబ్ల్యూజేఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవం

షాద్‌నగర్ అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) షాద్‌నగర్‌శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ తెలిపారు. షాద్‌నగర్ ఎన్‌హెచ్-44 హోటల్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా జె.రాఘవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, కోశాధికారిగా రమేష్, ఉపాధ్యక్షులుగా శీనయ్య, వెంకటయ్య, రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా రామకృష్ణగౌడ్, సలహాదారుడిగా గోపాల్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు, ఉపాధ్యక్షుడు లక్కాకుల రమేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న అందేకార్ యాదిలాల్

మహానాడుకు భారీగా జన సమీకరణ

ఆమనగల్లు, మే 24(ఆంధ్రజ్యోతి): ఏపీలోని కడప జిల్లాలో ఈనెల 27న నిర్వహించే టీడీపీ మహానాడుకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున జనసమీకరణ చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర సీనియర్‌నాయకుడు అందేకార్ యాదిలాల్ తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే మహానాడులో తెలుగు రాష్ట్రాల అభివృద్ధితో పాటు అనేక విషయాలపై చర్చించి తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యాదిలాల్ మాట్లాడుతూ మహానాడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలిరావాలన్నారు. పంచాక్షరి, అర్జం నర్సింహ, కాలే శివ, కండే భాస్కర్, ఎంగళి శ్రీధర్, తదితరులు ఉన్నారు.

బీసీ సేనా మహిళా కమిటీలు

చౌదరిగూడ, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి బీసీ సేనా మహిళా కమిటీని బీసీసేనా జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షురాలు ప్యాట జయ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బోయ యాదమ్మ, ఉపాధ్యక్షురాలిగా చంద్రమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరమ్మ, కార్యదర్శిగా రేణమ్మ, కోశాధికారిగా సత్యమ్మలతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

ఏఎస్సైకి.. ఎస్సైగా పదోన్నతి

- ఎమ్మెల్యే వీర్లపల్లి అభినందనలు



వెంకటేష్‌కు స్టార్లు పెడుతున్న ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు

కొత్తూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బంగరంపల్లి వెంకటేష్‌కు ఎస్సైగా పదోన్నతి లభించింది. సంవత్సరం క్రితం కొత్తూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధుల్లో చేరిన వెంకటేష్ పలువురి మన్ననలను పొందారు. ఎస్సైగా పదోన్నతి పొందిన వెంకటేష్‌కు స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు ప్లాప్‌లు(స్టార్‌లు) పెట్టి సన్మానించారు. ఇన్ముల్‌నర్వలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంకటేష్‌ను శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. కొత్తూర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సైలు మురళీగౌడ్, సత్యాశీలరెడ్డి, సిబ్బంది వెంకటేష్‌ను శాలువలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ

తలకొండపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): మెదక్‌పల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ ఛైర్మన్, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్ గర్భిణులకు మెడికల్ కిట్లు సమకూర్చారు. ఆశాలు, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. అలివేలు, నరేశ్‌రాజ్, తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



కొందుర్గులో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు



షాద్‌నగర్ రూరల్ : పాలాభిషేకం చేస్తున్న బుచ్చిగూడగ్రామస్తులు

చౌదరిగూడ/షాద్‌నగర్ రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పార్లమెంటరీ యూత్ మహబూబ్‌నగర్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నాయకులు, మాజీ సర్పంచులు లింగంగౌడ్, రాంరెడ్డి, నర్సింహులు, జహంగీర్ మల్లేష్‌గౌడ్, కావలి యాదయ్య, రామయ్యగౌడ్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా, షాద్‌నగర్ పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ఫరూఖ్‌నగర్ మండలం బుచ్చిగూడలో సీఎం రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటయ్యగౌడ్, మహేష్, వెంకటరమణారెడ్డి, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి మాది.. ప్రచారం మీదా?

- కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న సీనియర్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్

కొత్తూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మేమే చేశామంటూ కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని, అభివృద్ధి మాది.. ప్రచారం మీదా అంటూ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బి.దేవేందర్‌యాదవ్, బి.యాదయ్య, జంగగళ్ల కృష్ణయ్య, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు నర్సింహగౌడ్, సోమ్లనాయక్, గోపాల్‌గౌడ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని 6వ వార్డులో నివాసాల మీదుగా విద్యుత్ వైర్లు వెళ్లడంతో గతంలో విద్యుత్ షాక్‌కు గురై పలువురు మృతిచెందారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని.. 8 స్తంభాలను పాతించి నూతన విద్యుత్ వైర్ బిగించడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా విద్యుత్ తీగలను రోడ్డు దాటించేందుకు టవర్ నిర్మాణం జరగలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టవర్ నిర్మాణం పనులు అప్పుడు ఉన్న కాంట్రాక్టర్ పూర్తిచేయడం జరిగిందన్నారు. 20ఏళ్ల నుంచి యమపాశంగా ఉన్న విద్యుత్ వైర్లను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే తొలగించడం జరిగిందని ప్రచారం చేసుకోవడం ఎంతవరకు న్యాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేష్, రవినాయక్, లక్మయ్య, పేపర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం



కడ్తాల్ : ప్రొసీడింగ్స్ అందజేస్తున్న శ్రీనివాస్ గౌడ్



కేశంపేట : లింగంధనలో భూమిపూజ చేస్తున్న రాజేందర్‌రెడ్డి

కడ్తాల్, మే 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నిరుపేద కుటుంబాలకు మేలు జరుగుతుందని, దశాబ్దాల నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్లతో సాకారం అవుతుందని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ వైస్ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. ఎక్వాయిపల్లి, అన్మాస్‌పల్లి, సాలార్‌పూర్‌లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఆయా గ్రామాల నాయకులతో కలిసి ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. మాజీ సర్పంచ్ శంకర్, శంకర్ నాయక్, మాజీ ఎంపీటీసీలు ఉమావతి, గురిగళ్ల లక్ష్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు రామకృష్ణ, కేశవులు, జగన్ గౌడ్, తదితరులున్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిలో మంజూరు పత్రాలను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. రమేశ్‌యాదవ్, డేవిడ్, రేణురెడ్డి, అంజయ్య, మశ్చందర్, శంకర్, నరేందర్‌గౌడ్, రాహుల్ తదితరులున్నారు.

చేవెళ్ల : పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని పామెన మాజీ సర్పంచ్ దావల్ గారిగోపాల్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు విజయ్, ఎర్ర గోపాల్, రాములు, సత్యనారాయణ, సతీష్ తదితరులు ఉన్నారు.

కేశంపేట : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బండెల రాజందర్ రెడ్డి అన్నారు. లింగంధన గ్రామంలో భూమి పూజ చేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

కందుకూరు : రాజకీయాలకతీతంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు మాజీ వైఎస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు, తిమ్మాపురం ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్ సస్నీళ్ల నర్సింహులు తెలిపారు. నేదునూరు, కందుకూరు, తిమ్మాపురంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఎండీ అఫ్జల్‌బేగ్, పుష్పదర్శన్, జి.సుధాకర్‌రెడ్డి, పి.కృష్ణ, కె.రవీందర్, రాంరెడ్డి, సరికొండ జగన్, ఎస్ వీరారెడ్డి, గాదె కుమార్, జగన్, జగదీష్, ఉదయ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మెయింటెనెన్స్ చార్జి ఇవ్వాలంటూ ఫ్లెక్సీ ఏర్పాటు

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల బ్యానర్..

పోలీసులకు మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు

శంకర్‌పల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ యోగేష్ శనివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండలం మహాలింగపురం గ్రామానికి చెందిన ఖురేషి బాయ్ ఇటీవల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద నివాసముంటున్న వారు తప్పనిసరిగా నెలనెలా రూ.600 చొప్పున మెయింటెనెన్స్ నిధుల పేరిట తనకు ఇవ్వాలని ఏకంగా ఫ్లెక్సీ కట్టడం వివాదాస్పదంగా మారింది. దాంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివాసం ఉంటున్న వారితో పాటుగా జీహెచ్‌ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-3లు వేర్వేరుగా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ వెంటనే సిబ్బందితో అక్కడికి వెళ్లి 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌజెస్-శంకర్‌పల్లి (1బ్లాక్ టూ13 బ్లాక్)పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించారు. ఈమేరకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వ్యక్తికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో ఎలాంటి సంబంధం లేదు. అయినప్పటికీ ఆయన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నివాసముంటున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అలాంటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇళ్లలో నివాసం ఉంటున్న వారు మాత్రమే గ్రూపుగా ఏర్పడి నిర్వహణ చూసుకోవాలని, బయటి వ్యక్తులు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. అక్రమ వసూళ్లకు పాల్పడి పేదవారిని ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి అండగా నాయకులు

కేశంపేట, మే 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన దానగాళ్ల ఎల్లయ్య(68) అనారోగ్య కారణాలతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ పసుల మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కామ్లేకార్ నవీన్‌కుమార్, జమాల్ ఖాన్‌లను పరమార్శించి రూ.20వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన బీజేపీ యూత్ అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్ ఎల్లయ్యకు నివాళులర్పించి, వారి కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. నరేష్‌యాదవ్, జగన్‌రెడ్డి, కుంటి లక్ష్మయ్య, కృష్ణ, ఆంజనేయులు, బాలయ్యగౌడ్, శంకర్, బాలు, విజయ్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా ప్రజల బతుకుల్లో మార్పు రాలేదు



బస్తేపూర్‌లో మాట్లాడుతున్న సత్తిరెడ్డి

చేవెళ్ల, మే 24(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల బతుకుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదని సీపీఐ చేవెళ్ల మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల మండల పరిధిలోని బస్తేపూర్‌లో సీపీఐ గ్రామ శాఖ మహా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై ధరల భారం మోపడంతో పేదలు ఆర్థిక సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, జంగయ్య, వెంకటయ్య, సంధ్య, నర్సింహులు, వెంకట్‌రెడ్డి, సావిత్రి, రాజేష్, లక్ష్మి, అనంతయ్య ఉన్నారు.